క్లుప్తంగా

10న కార్తీక వనభోజనం



బ్రాహ్మణ సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్, మహేష్

పుంగనూరు: పట్టణ సమీపంలోని గూడూరుపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఈనెల 10న కార్తీక వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు రాజేష్, మహేష్, బాబు తెలిపారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్తీక మాసంలో ఏటా నిర్వహించే రీతిలో బ్రాహ్మణ వనభోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి బ్రాహ్మణ కుటుంబ సభ్యులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈసందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, పాటల కచేరి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘ సభ్యులు పవన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన



నిర్వహిస్తున్న వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె: ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంలోని తీర్థం పీహెచ్‌సీ ఆవరణలో బుధవారం ఆర్.ఎల్ జాలప్ప ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 43 మందికి పరీక్షలు నిర్వహించారు. 9 మందిని ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. ప్రతినెలా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు హర్షిత, అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. శస్త్రచికిత్సకు ఎంపికైన వారికి ఉచితంగా చేయిస్తామన్నారు.

బాధ్యతల స్వీకరణ



వెంకటమోహన్

రామకుప్పం: మండల నూతన ఎస్‌ఐగా పి.వెంకటమోహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన శివకుమార్ వీఆర్‌కు వెళ్లారు. 4 నెలలుగా ఖాళీగా ఉన్న రామకుప్పం ఎస్‌ఐ స్థానంలో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేసిన వెంకట మోహన్ బదిలీపై రామకుప్పం ఎస్‌ఐగా వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానన్నారు.


రోడ్డు బాగు చేయరూ!



కోతకు గురైన రోడ్డు

సదుం: మండల కేంద్రం నుంచి చెరుకువారిపల్లెకు వెళ్లే మార్గంలో ఖబ్రస్థాన్ వద్ద ఎంపీడీఓ కార్యాలయం వెళ్లే మలుపులో ప్రధాన రహదారి పక్కన మట్టి కోతకు గురైంది. దీంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వాహనం వస్తే రోడ్డు దిగాలంటే ఇబ్బందికరంగా మారి, ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అలాగే రోడ్డు పలుచోట్ల గుంతలమయంగా మారడంతో ఇక్కట్లు తప్పడం లేదు. అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చెత్త సమస్య పరిష్కరించరా?



చెరుకువారిపల్లె మార్గంలో రోడ్డు పక్కన డంప్ చేసిన చెత్త

సదుం: మండల కేంద్రంలో సేకరించిన చెత్తను శివార్లలో రోడ్ల పక్కన పడేస్తున్నారు. పీలేరు, చెరుకువారిపల్లె మార్గాలలో వేసిన చెత్తకు కొందరు నిప్పు పెట్టడంతో పొగ వ్యాపించి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ప్రభుత్వం బృందావనాలను ప్రారంభించినా సమస్య తీరడం లేదు. దీనిపై ఈఓ హసీనాను వివరణ కోరగా..చెత్త తరలించేందుకు ప్రస్తుతం స్థలం లేదని, గుంత తీసి చెత్త వేసేందుకు స్థలం కోసం తహసీల్దార్‌ను కోరామని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

కలెక్టర్‌తో పోలీసు అధికారుల భేటీ





కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాకు బదిలీపై విచ్చేసిన పలువురు పోలీసు అధికారులు బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీని మర్యాద పూర్వకంగా కలిశారు. 8వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు కేవీఎస్‌బీ మల్లికార్జున, కట్టెడ సింగయ్య కలెక్టర్‌ను కలిసి శాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

మరో కేజీఎఫ్-3

- చెరువుల్లో జేసీబీలతో మట్టి, ఇసుక తవ్వకాలు
- అవసరమైన వారికి అప్పగానే అమ్మకాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం





బైరెడ్డిపల్లి పెద్దచెరువులో యథేచ్ఛగా మట్టి, ఇసుక తవ్వకాలు

పలమనేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పచ్చ తమ్ముళ్లు ఎన్ని అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదించాలో అన్ని మార్గాలను చేసుకుంటూ వెళుతున్నారు. గతంలో కూడా ఇలాంటి అక్రమాలు కొంతవరకు సాగినా ఇంతా దారుణంగా ఎన్నడూ లేదని జనం అనుకుంటున్నారు. ఇదిలా ఉండగా మరింత తెలివిని ప్రదర్శిస్తున్న వీరిని చూసి జనమే మీకు వేయిదండాలురా సామీ అంటూ ఎత్తిపొడుస్తున్నారు. చెరువుల్లోని బంక మట్టిని రైతుల పొలాలకు అమ్ముకుంటున్నారు. ఆపై కిందనున్న ఇసుకను కర్ణాటక రాష్ట్రానికి చెందిక స్మగ్లర్లకు ఇచ్చి అమ్ముకుంటున్నారు. దీంతో పలమనేరు నియోజకవర్గంలోని చెరువులు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి.

మట్టిని తోడేస్తున్నారు

నియోజకవర్గంలోని ఆయా చెరువుల్లో పైన బంక మట్టి, దానికింద నాణ్యమైన ఇసుక లభిస్తోంది. దీన్ని గమనించిన అక్రమార్కులు చెరువుల్లో జేసీబీ వాహనాలను పెట్టి పైనున్న మట్టిని తోడేస్తున్నారు. దీన్ని రైతులకు చేలకు అమ్ముకోవడం లేదా రియల్ ఎస్టేట్ వెంచర్లకి తోలుకుంటున్నారు. ఇక అసలైన కథ ఏంటంటే చెరువులోని బంకమట్టి కింద దొరికే ఇసుకను ట్రాక్టర్లతో రహస్య డంపులకు తరలిస్తున్నారు. ఇలా నాలుగైదు లోడ్ల ఇసుక డంప్ కాగానే రాత్రికి రాత్రే దాన్ని కర్ణాటకకు తరలించేస్తున్నారు. ఈవిధంగా నాలుగు రకాలుగా డబ్బులు సంపాదించే మార్గాలు పచ్చనేతలలకు తెలిసినట్టుగా మరెవరికీ సాధ్యంకాదని చేతల్లో చూపుతున్నారు.

ఏ చెరువులో చూసినా జేసీబీ, ట్రాక్టర్లే..

పలమనేరు మండలంలోని కొండిన్య నదిలో పదుల చోట్ల ఇసుక అక్రమరవాణా యథేచ్ఛగా సాగుతోంది. మరోవైపు మొరం చెరువుతోపాటు అడవికి ఆనుకుని ఉన్న కుంటల్లోనూ ఈ తంతు ఎక్కువగా సాగుతోంది. పెద్దపంజాణి మండలంలోని కొండిన్య నది పరివాహక ప్రాంతాలతోపాటు నీళ్లు తగ్గిన చెరువుల్లో మరీ ఎక్కువగా అక్రమాలు సాగుతున్నాయి. నియోజకవర్గంలో ఏ చెరువులో చూసినా పచ్చతమ్ముళ్ల మట్టి, ఇసుక వ్యాపారాలు జోరందుకున్నాయి. ఇలాంటి అక్రమాలు ఇప్పుడు చేసుకోకుంటే మళ్లెప్పుడనే మాటతో ఎవరు పడితే వారు మెడలో పసుపు కండువా వేసుకోవడం, ట్రాక్టర్‌కు జై టీడీపీ, చంద్రబాబు అని రాసుకోవడం ఇక్కడ షరామామూలుగా తయారైంది.

బైరెడ్డిపల్లి చెరువులో కేజీఎఫ్ లాగే..

నియోజవర్గంలోని బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని చెరువులో నిత్యం నాలుగైదు జేసీబీలు, పదుల సంఖ్యలో ట్రాక్టర్లు మట్టిని తోడేస్తున్నారు. ఆపై మట్టి కింద ఉన్న ఇసుకను తోడి అమ్ముకుంటున్నారు. ఈ తతంగం అంతా అక్కడి ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల ముందే సాగుతున్నా దీనిపై అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. అసలు మైనర్ ఇరిగేషన్ అధికారులు పచ్చనేతలకు ఇప్పటికే సరెండర్ అయ్యారు.

అదే చెరువుల్లో ఉపాధిలో దొంగపనులు సైతం..

పాత గుంతలకు కొత్తగా పనులు మంజూరు చేసి ఈజీఎస్ అధికారులు సైతం వీరికి పూర్తిగా సహకరిస్తున్నారు. కొన్ని మండలాల్లో ఉపాధి కూలీల జాబ్‌కార్డులను సైతం టీడీపీ చోటా నేతలు సేకరించుకొని వారు పనులు చేసినట్టుగా మస్టర్లు పెట్టించి పనులు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక చెరువుల్లో మట్టిపై అజమాయిషీ కలిగిన ఇరిగేషన్ అధికారులు తమకు సంబంధమే లేదన్నంటూ వ్యవహరిస్తున్నారు. ఇక ఇసుక అక్రమరవాణాను అడ్డుకోవాల్సిన సెబ్, రెవెన్యూ, పోలీసులు ముందే ఇసుక ట్రాక్టర్లు వెళుతున్నా ఆవైపు కన్నెత్తి చూడడం లేదు. ఈవిధంగా అధికార యంత్రాగం అక్రమార్కులకు మద్దతుగా నిలుస్తుంటే అక్రమాలు ఎందుకు జరగవనేమాట ప్రజల నుంచి సర్వత్రా వినిపిస్తోంది. ఈ విషయమై స్థానిక ఇరిగేషన్ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించినా మాట్లాడేవారే కరువయ్యారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- మండల అభివృద్ధికి కృషిచేద్దాం
- సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్మన్, ఎంపీపీ



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

వి.కోట: ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలంటే అన్ని పార్టీలు సోదరభావంతో పార్టీల కతీతంగా ముందుకెళితే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ యువరాజు అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యువరాజ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వంలో తొలి సర్వసభ్య సమావేశం ఇదని, అందరి సమన్వయంతో అభివృద్ధి పనులు జరగడానికి కృషిచేయాలని ఎంపీపీ సూచించారు. పలుశాఖాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య వేధిస్తోందన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించడానికి అవసరమైతే ఎంపీపీ, జెడ్పీ నిధులను వినియోగించి అవసరమైన చోట్ల బోర్లు వేయించి, పైప్‌లైన్లు ఏర్పాటు చేయిస్తామని జెడ్పీ చైర్మన్, ఎంపీపీ హామీ ఇచ్చారు. అలాగే పశుసంరక్షణ శాఖ నిర్లక్ష్య ధోరణిపై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామని ఆశాఖ అధికారులు హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీలు లక్ష్మణ్‌రెడ్డి, తమీమ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పీ గౌస్, ఎంపీడీఓ ఈశ్వరన్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

వి.కోటలో నేడు విద్యుత్ ఉప కేంద్రం ప్రారంభం

వి.కోట: మండలంలోని తోటకనుమ వద్ద నిర్మించిన 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కో ద్వారా నిర్వహించనున్న ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర రవాణా, యువజనశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావ్, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి హాజరవుతారని ఆయన ప్రకటనలో తెలిపారు.

వేడుకగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కుప్పం: పట్టణంలోని విజయలక్ష్మీ రోడ్డు సర్కిల్ వద్ద వేడుకగా అభయ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ప్రధాన కూడలి కావడంతో నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. దీంతో అభయ ఆంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ఠిస్తే ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని పలువురు సూచించారు. సూచనల మేరకు మునుస్వామిపురం యువత విగ్రహ ప్రతిష్ఠకు శ్రీకారం చుట్టారు. మూడు రోజులుగా విజయలక్ష్మి రోడ్డు సర్కిల్‌లో ప్రత్యేక పూజలు చేసి కుంభాభిషేక వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

బైక్ రైడర్ల ఓవరాక్షన్!



పలమనేరు బైపాస్ రోడ్డులో బైక్‌పై విన్యాసాలు చేస్తున్న యూత్



- సైలెన్సర్‌లో మఫ్లర్ తీసేసి రైడింగ్
- కర్ణభేరిలదిరేలా శబ్దకాలుష్యం
- జనం రద్దీగా ఉన్నప్పుడే వీరి ప్రతాపం

పలమనేరు: మున్సిపాలిటీతోపాటు నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో బైక్ రైడర్ల గోల శ్రుతిమించుతోంది. సైలెన్సర్‌లోని మఫ్లర్‌ను తొలగించేసి గుగుర్పాటు పుట్టించే శబ్దంతో ప్రజల మీదుగా దూసుకుపోతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. పోలీసులు ఎందుకు పట్టించుకోలేదా అని జనం ఆశ్చర్యపోతున్నారు. ముఖ్యంగా అధిక సీసీ కలిగిన బైక్‌లు వందల సంఖ్యలో తిరుగుతున్నాయి. స్థానిక హైవేలోని బైపాస్ రోడ్లలో బైక్ రైడింగ్ తంతు మొత్తం పోలీసులు, రవాణా అధికారులు కళ్లముందే యథేచ్ఛగా సాగుతోంది.

ఇదిగో సాక్ష్యం..

మితిమీరిన వేగంతో బైక్‌లను నడపడంతో ప్రమాదాలు జరిగి పలువురు యువకులు, కళాశాల విద్యార్థులు పదిమంది దాకా గత ఐదేళ్లలో మృత్యువాత పడ్డారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఇలాంటి ప్రమాదాలు పట్టణంలోనే కాదు మండల కేంద్రాల్లోనూ నిత్యకృత్యంగా మారాయి.

కళాశాలలు వదిలే సమయంలో..

పట్టణంలోని కళాశాలలు వదిలిపెట్టే సమయంలో విద్యార్థినులు రోడ్లపై వస్తుంటారు. ఈ సమయంలో పదుల సంఖ్యలో రైడర్లు బైక్‌లను వేగంగా భారీ శబ్దాలతో నడుపుతూ వారిని భయాందోళనకు గురిచేస్తున్నారు. విద్యార్థినుల పైకి వెళ్లినట్టు వెళ్లి పక్కకు తిప్పడం, ఆపై వెకిలిచేష్టలు చేయడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఇక్కడి కళాశాలల నుంచి పలు స్టూడెంట్ బస్సులు గ్రామాలకు వెళుతుంటాయి. ఆ బస్సుల వెనుక ఆకతాయిలు రైడ్ చేస్తూ వారు పడేపాట్లు చూసి జనం అసహ్యించుకుంటున్నారు. ఇక రాత్రి పదిగంటలు దాటితే పట్టణంలోని మెయిన్ రోడ్డుపై వీరి ఆగడాలు అన్నీ ఇన్నీకావు. రోడ్డుపై ట్రాఫిక్ పోలీసులున్నా ఏమాత్రం బెదరరు. వారి ముందు మరింత వేగంగా వెళుతుంటారు.

మండల కేంద్రాల్లో మరీ ఘోరం...

నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి, వి.కోట మండల కేంద్రాల్లో ఎక్కువ శబ్దం చేసే బైక్‌లు ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. పలువురు యువకులు కేవలం ప్రజల ముందు హంగామా చేయడానికే వీటిని కొన్నట్టు తెలిసింది. ముఖ్యంగా బైరెడ్డిపల్లి చెక్‌పోస్టు, పుంగనూరు రోడ్డు ప్రాంతంలో ఉదయం 9 గంటల నుంచి 11 దాకా సాయంత్రం 4 నుంచి రాత్రి 12 దాకా వీరి ఆగడాలకు హద్దు లేకుండా పోయింది. ఉదయం పూట నాలుగు రోడ్ల సమీపంలోని గార్మెంట్స్‌కు వెళ్లే మహిళలు వందల సంఖ్యలో చెక్‌పోస్టులో ఉంటారు. వారిని చూసి రైడర్లు మరీ రెచ్చిపోతున్నారు. అక్కడి పోలీసులు వీరిని చూస్తున్నా అది తమ పనికాదంటూ వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి.

రాత్రిపూట బెట్టింగ్‌లు..

ఇక బైక్ రైడింగ్ బెట్టింగులు సైతం ఇక్కడి హైవేలో సాగుతున్నాయి. కొందరు రైడర్లు అతిగా మద్యం తాగి మరీ డ్రైవ్ చేస్తున్నట్టు సమాచారం. ఈ కారణంగా ద్విచక్రవాహనాల ప్రమాదాలు ఎక్కువగా సాగుతున్నట్టు తెలుస్తోంది. మరికొందరు బైక్‌లను కేవలం ఒక చక్రంపై నడపడం కూడా ఎక్కువగా ఉంది. ముఖ్యంగా బెంగళూరు నుంచి పలమనేరు దాకా బెంగళూరు, హోస్‌కోటకు చెందిన పలువురు యువకులు టైమింగ్ చేజ్ పేరిట పందేలు నిర్వహిస్తున్నారు. ఈ బెట్టింగులలో మొదటి బహుమతిగా రూ.లక్ష ఉంటుంది. ఇలాఉండగా జిల్లాలో గతేడాది ఏడొందలదాకా రోడ్డు ప్రమాదాలు జరగ్గా వీరిలో వీరిలో 10 మందికి పైగా వేగంగా బైక్‌ను నడిపిన యువకులే కావడం గమనార్హం. ఇక గాయపడిన 366మందిలో 60మంది కళాశాల విద్యార్థులు, యువకులే కావడం కొసమెరుపు. గతంలో పోలీసులు బైక్ రైడర్లపై దృష్టి సారించి వంద దాకా సైలెన్సర్లను సీజ్ చేశారు. నిర్లక్ష్యంగా బైక్ నడిపినందుకు వారికి జరిమానా విధించారు. కానీ బక్ రైడర్ల గోల ఇప్పటికీ తప్పడం లేదు. దీనిపై డీఎస్పీ స్థాయి అధికారులైనా చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

అంతర్జాతీయ గుర్తింపు తెద్దాం



టెర్రకోట హస్త కళాఖండాలను పరిశీలిస్తున్న జేసీ విద్యాధరి

- జేసీ విద్యాధరి

పలమనేరు: గంటావూరులో హస్తకళాకారులు తయారు చేస్తున్న టెర్రకోట బొమ్మలకు అంతర్జాతీయంగా గుర్తింపును తీసుకొచ్చేందుకు కృషిచేస్తామని జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. ఆమేరకు స్థానిక ఆర్డీఓ భవానితో కలసి గంటావూరులోని టెర్రకోట కాలనీని బుధవారం ఆమె పరిశీలించారు. అక్కడ తయారుచేస్తున్న కళాకండాలను గమనించి ఆశ్చర్యపోయారు. ఇప్పటిదాకా డీఆర్‌డీఏ ద్వారా వారికి కలిగిన మేలును టెర్రకోట సంఘ నేత రామక్రిష్ణ ఆమెకు వివరించారు. ఇంకా కొన్ని యంత్రాలు అవసరమని కోరారు. వీటిని మంజూరు చేసేందుకు కృషిచేస్తామని ఆమె తెలిపారు. ఆపై పట్టణ సమీపంలోని రాధాబంగ్లా ప్రాంతంలో ఎస్టీపీ (సేవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)నిర్మాణం కోసం భూసేకరణ చేసేందుకు అవసరమైన స్థలాలను పరిశీలించారు. పట్టణంలోని 7.8 ఎంఎల్‌డీ మురుగునీరు పెద్దచెరువులోకి వెళ్లకుండా దాన్ని ఎస్టీపీలో శుభ్రం చేసి ఆనీటిని ఈ ప్రాంతంలోని రైతులకు అందించేలా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దీంతోపాటు పక్కనే 13 సెంట్లలో ఎఫ్ఎస్‌డీపీని సైతం నిర్మిస్తామని తెలిపారు. ఈ పనులు పూర్తయితే పట్టణంలోని పెద్దచెరువు కాలుష్య సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఆపై పట్టణ సమీపంలోని ఎంఎల్ఎస్ గోడౌన్‌ను వారు తనిఖీ చేశారు. తనిఖీల్లో అక్కడున్న స్టాకు వివరాలు, గోదాముల్లోని తూకాలను తూచి బరువుల్లో వ్యత్యాసాలను గమనించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, తహసీల్దార్ ఇన్బనాథన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సులభ కాన్పు



కాన్పు చేసిన వైద్యురాలు లహరి

గంగవరం: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణికి గంగవరం పీహెచ్‌సీలో సులభ కాన్పు చేశారు. మూడున్నర కిలోల మగబిడ్డకు బుధవారం ఆమె జన్మనిచ్చింది. కలగటూరు గ్రామానికి చెందిన రోహిణి గర్భిణి. రెండవ కాన్పు సమయంలో పురిటి నొప్పులు రావడంతో వైద్య సిబ్బంది ఆమెను గంగవరం పీహెచ్‌సీకి తరలించారు. గర్భంలోనే బిడ్డ బరువు ఎక్కువ కావడంతో సిజేరియన్ చేయాల్సిన పరిస్థితి. అయితే వైద్యురాలు లహరి తన చాకచక్యతను ప్రదర్శించి గర్భిణికి సిజేరియన్ లేకుండా సులభ కాన్పు చేశారు. మహిళ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యురాలు తెలిపారు. దీంతో ఆమె కుటుంబీకులు వైద్యురాలికి ధన్యవాదాలు తెలిపారు. ఒక రోజు వైద్యుల పర్యవేక్షణలో ఉంచుకుని నేడు తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో వారి గ్రామానికి పంపిస్తామని సందర్భంగా వైద్యాధికారి శ్రీనివాసులు తెలిపారు.

ఎస్‌హెచ్‌జీ యాప్‌తో లాభాలు

- మెప్మా పీడీ రాధమ్మ



ఆర్‌పీల శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ రాధమ్మ

పలమనేరు: స్వయం సహాయ సంఘాలకు ప్రొఫైల్ యాప్ ద్వారా ఎన్నో లాభాలుంటాయని మెప్మా పీడీ రాధమ్మ అన్నారు. ఆమేరకు పలమనేరు మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ మెప్మా సిబ్బంది, ఆర్‌పీలతో ఆన్‌లైన్ యాప్‌పై ఆమె బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఆఫ్‌లైన్‌లోనే సాగడం వలన అవకతవకలకు అవకాశం ఉంటుందన్నారు. దీన్ని గమనించిన మిషన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆన్‌లైన్ విధానాన్ని అమలుచేస్తున్నట్టు తెలిపారు. సభ్యుల పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదయ్యాక సంఘ లావాదేవీలను పారదర్శకంగా చూసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. సంబంధిత సమాఖ్యకు సంబంధించిన ప్రాథమిక ఆర్థిక, సాంఘిక సమాచారం సైతం ఇందులో లభ్యమవుతుందని తెలిపారు. అదేవిధంగా మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను సైతం ఆన్‌లైన్‌లో విక్రయాలు చేసేందుకు వీలుంటుందని సూచించారు. కమిషనర్ రమణారెడ్డి, జిల్లా టీఈలు కృష్ణవేణి, ప్రమీళ, సీఎంఎం బాబా, సీఓలు, టీఎల్ఎఫ్, ఎస్ఎల్ఎఫ్ ఆర్‌పీలు పాల్గొన్నారు.

అనాథ శవానికి ఆ నలుగురూ!



అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

కుప్పంరూరల్: అనాథ శవానికి అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్న వైనం కుప్పంలో బుధవారం చోటుచేసుకుంది. గత నెల 30న ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి బిహార్‌కు చెందిన ఓ యువకుడు మృతిచెందాడు. వారం రోజులయినా ఆ యువకుని మృతదేహం తీసుకెళ్లేందుకు ఎవరు రాకపోవడంతో రైల్వే పోలీసులు స్థానికుల సాయంతో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. డి.కె.పల్లికి చెందిన మణి, స్థానికుడు లక్ష్మీనారాయణ, రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తమ బృందంతో కలసి అనాథ శవానికి అంత్యక్రియలు జరిపి మానవత్వాన్ని చాటుకున్నారు. మృతదేహాన్ని గుల్లేపల్లి రోడ్డులోని శ్మశాన వాటికకు తరలించి సంప్రదాయ పద్ధతిలో పూడ్చిపెట్టారు. అనాథశవానికి అంత్యక్రియలు చేయడంపై మణి, లక్ష్మీనారాయణ, నాగరాజులను స్థానికులు అభినందించారు.



మర్రిమాకులపల్లెలో బోరు వద్ద ఫ్యూజ్ క్యారియర్లు

● డేంజర్.. డేంజర్

అధికారుల నిర్లక్ష్యం కారణంగా పెనుప్రమాదాలు జరిగితేకానీ పట్టించుకోరా అంటూ ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. మర్రిమాకులపల్లెలో తాగునీటి సరఫరా చేసే బోరు పక్కలోనే తక్కువ ఎత్తులో ఫ్యూజ్ క్యారియర్లు ఏర్పాటుచేశారు. వాటి పక్కనే ఆవులు కట్టేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అలాగే కోటూరు మార్గం, కొండయ్యగారిపల్లె సమీపంలో ఏర్పాటుచేసిన 11 కేవీ విద్యుత్ స్తంభాలు ఒక వైపునకు వాలిపోయాయి. పెనుప్రమాదం సంభవించక ముందే అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

–చౌడేపల్లె





కోటూరు మార్గంలో వాలిపోయిన విద్యుత్ స్తంభం, కొండయ్యగారిపల్లె సమీపంలో..